క్లుప్తంగా

బాబయ్య దర్గాలో ఎమ్మెల్సీ ప్రార్థనలు


పెనుకొండ బాబాయ్య దర్గాను సందర్శించుకుంటున్న ఎమ్మెల్సీ మహమ్మద్ ఇక్బాల్

హిందూపురం: నియోజకవర్గంలోని ప్రజలందరిపై అల్లా చల్లని దీవెనలుండాలని ఎమ్మెల్సీ మహమ్మద్ ఇక్బాల్ అన్నారు. ఆదివారం సాయంత్రం పెనుకొండ బాబాయ్య దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేసి చదివింపులు చేశారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ఘన విజయం సాధించడంతో పాటు వైఎస్ జగన్ మరోసారి ముఖ్యమంత్రి అయ్యే చూడాలని బాబయ్య స్వామిని వేడుకున్నట్లు ఎమ్మెల్సీ ఇక్బాల్ తెలిపారు. అనంతరం దర్గా సందర్శనకు వచ్చిన భక్తులతో పాటు అక్కడి వారందరికీ అన్నదానం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

హైవేపై బైక్‌తో స్టంట్లు

- ఇద్దరు యువకులకు గాయాలు


గాయపడిన యువకులు

పెనుకొండ రూరల్: పెనుకొండ 44వ జాతీయ రహదారిపై బైక్‌తో స్టంట్లు చేస్తూ అదుపుతప్పి ఇద్దరు యువకులు గాయాలపాలైన ఘటన ఆదివారం చోటు చేసుకుంది. స్థానికుల వివరాలు మేరకు.. అనంతపురం వైపు నుంచి బెంగుళూరు వెళ్తున్న యువకులు రెండు ద్విచక్ర వాహనాల్లో వెళ్తున్నారు. జాతీయ రహదారి కియా మెయిన్ గేట్ నుంచి పోటీ పడుతూ స్టంట్లు చేసుకుంటూ దుద్దేబండ మలుపు సమీపంలోకి రాగానే అదుపుతప్పి బోల్తా పడ్డారు. ఈ ఘటనలో బెంగళూరుకి చెందిన సంతోష్, అమిత్ గాయపడ్డారు. పెనుకొండ ఆస్పత్రిలో చికిత్స తర్వాత మెరుగైన వైద్యం కోసం హిందూపురం తరలించినట్లు వైద్యులు పేర్కొన్నారు.

పాసులను సద్వినియోగం చేసుకోండి


శక్తి యోజన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వెంకటేశ్

పావగడ: రాష్ట్ర ప్రభుత్వం అందించిన ఉచిత బస్సు పాసులను సద్వినియోగం చేసుకోవాలని స్థానిక ఎమ్మెల్యే హెచ్‌వీ వెంకటేశ్ మహిళలకు సూచించారు. స్థానిక మున్సిపల్ బస్టాండులో ఆదివారం ఏర్పాటు చేసిన శక్తి యోజన పథకం ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన ప్రతి హామీని సీఎం సిద్ధరామయ్య ఆధ్వర్యంలోని ప్రభుత్వం నెరవేరుస్తుందన్నారు. అనంతరం మహిళలు ఉచితంగా ప్రయాణించే బెంగళూరు, తుమకూరుకు వెళ్లే కేఎస్ఆర్‌టీసీ బస్సులను ఎమ్మెల్యే స్వయంగా కాసేపు నడిపారు. మాజీ ఎమ్మెల్యే వెంకటరమణప్ప, సుదేశ్‌బాబు, శంకరరెడ్డి, గుర్రప్ప తదితరులు పాల్గొన్నారు.

సజావుగా ఆరో తరగతి ప్రవేశ పరీక్ష


అమరాపురం: మోడల్ పాఠశాలలో ప్రవేశ పరీక్ష రాస్తున్న విద్యార్థులు

సాక్షిబృందం: హిందూపురం, మడకశిర, పెనుకొండ నియోజకర్గాల్లో ఉన్న ఏపీ మోడల్ స్కూళ్లలో 6వ తరగతిలో ప్రవేశానికి ఆదివారం నిర్వహించిన ప్రవేశ పరీక్ష సజావుగా జరిగింది. ఈ సందర్భంగా ఆయా ప్రాంతాల్లో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు ఉదయం 9:30 గంటలకే పరీక్షా కేంద్రాలకు చేరుకున్నారు. పది గంటలకు పరీక్ష ప్రారంభమైంది.

కన్నడ సంస్కృతిని కాపాడండి


జానపద ఉత్సవాన్ని ప్రారంభిస్తున్న సంజయ కుమార స్వామిజీ

పావగడ: కన్నడ సంస్కృతి, సాంప్రదాయాలను కాపాడి భావితరాలకు అందించాల్సిన బాధ్యత మనందరిపై ఉందని స్థానిక నిడుగల్ వాల్మీకి ఆశ్రమ పీఠాధిపతి సంజయ కుమార స్వామిజీ తెలిపారు. తాలూకాలోని కెంచమ్మనహళ్లిలో వినాయక సాంస్కృతిక కళా సంఘం ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన గడినాడు జానపద ఉత్సవ కార్యక్రమంలో స్వామిజీ ఉపదేశించారు. ఈ సందర్భంగా కీలు గుర్రం, కోలాటం, సోమన కుణిత, గారడి బొమ్మ తదితర జానపద కళలను ప్రదర్శించారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీ సభ్యుడు పాపణ్ణ, సంఘం కార్యదర్శి బీటీ రాజణ్ణ, విజయమ్మ, మరిస్వామి, లింగప్ప ,బలరామ్ తదితరులు పాల్గొన్నారు.

తెగులు.. గుబులు

- తెగుళ్ల బారిన పడుతున్న వక్క తోటలు
- ఆందోళనలో రైతులు
- జాగ్రత్తలతో తెగుళ్లను నివారించవచ్చని చెబుతున్న ఉద్యానశాఖ అధికారులు

జిల్లాలో మొత్తం వక్క తోటల విస్తీర్ణం	1,400 హెక్టార్లు
పంటకు వచ్చిన వక్క తోటల విస్తీర్ణం	1000 హెక్టార్లు
పంటకు రాని వక్క తోటల విస్తీర్ణం	400 హెక్టార్లు
ప్రస్తుతం క్వింటాల్ పచ్చి వక్క ధర	రూ.8 వేలు
ప్రస్తుతం క్వింటాల్ ఎండిన వక్క ధర	రూ.50 వేలు


వక్క చెట్టులోనే ఎండిపోయిన ఒంబాళి


తెగులు సోకడంతో చిన్న వక్క చెట్టులో ఎండిపోయిన గరులు

మడకశిర : జిల్లాలోనే వక్క తోటలకు మడకశిర నియోజకవర్గం పెట్టింది పేరు. ఏ నియోజకవర్గంలో లేని విధంగా మడకశిరలో రైతులు వక్క తోటలు సాగు చేశారు. జిల్లా వ్యాప్తంగా మడకశిర నియోజకవర్గంలో వక్క తోటల సాగు 1,400 హెక్టార్ల విస్తీర్ణంలో ఉంది. ఇందులో 1000 హెక్టార్ల విస్తీర్ణంలోని వక్క తోటలు పంటకు వచ్చాయి. మిగిలిన 400 హెక్టార్ల విస్తీర్ణంలోని వక్క తోటలు ఇంకా పంటకు రాలేదు. ఇలాంటి పరిస్థితిలో వక్క తోటలకు తెగుళ్ల సోకడం రైతులకు ఆందోళనకరంగా మారింది.

తెగుళ్లతో రైతుల ఆందోళన

ఎన్నడూ లేని విధంగా వక్క తోటలకు కూడా ఈ ఏడాది తెగుళ్లు సోకుతున్నాయి. ప్రధానంగా వక్క చెట్లలోనే ఒంబాళులు (కంకులు) ఎండిపోతున్నాయి. ఒక వక్క చెట్టుకు మూడు నుంచి ఐదు వరకు ఒంబాళులు పూస్తాయి. ఇందులో రెండు మూడు ఒంబాళులు ఎండి పోతున్నాయి. దీంతో వక్క దిగుబడి తగ్గే ప్రమాదం ఏర్పడింది. అదే విధంగా కొత్తగా సాగు చేసిన వక్క చెట్లకు కూడా ఈ తెగులు సోకింది. చెట్లలోనే గరులు ఎండిపోతున్నాయి. దీంతో చెట్ల పెరుగుదల సన్న గిల్లుతోంది. ఫలితంగా వక్క పంటకు రావడానికి ఆలస్యం అవుతుంది.

ఎండ తీవ్రతతోనే...

ఎండ తీవ్రతకు వక్క చెట్లకు తెగుళ్లు సోకుతున్నాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈఏడాది ఎండ తీవ్ర పెరిగింది. కొంత మేరకు వాతావరణం చల్లగా ఉండే మడకశిర ప్రాంతంలో కూడా ఈసారి ఎండ వేడిమి పెరిగింది. 40 డిగ్రీల వరకూ ఉష్ణోగ్రతలు నమోదు అవుతున్నాయి. దీంతో వక్క తోటలకు తెగుళ్లు ఎక్కువయ్యాయి. వక్క చెట్లకు ఎండ వేడిమి తట్టుకునే సామర్థ్యం తక్కువగా ఉంటుంది. దీంతో ఒంబాళులు ఎండిపోతున్నాయి. అలాగే గరులు కూడా ఎండ వేడిమికి ఎండుతున్నట్లు ఉద్యానశాఖ అధికారులు చెబుతున్నారు.

దిగుబడి తగ్గే ప్రమాదం



గతంలో వక్క చెట్లకు ఎప్పుడూ తెగుళ్లు రాలేదు. అయితే ఈ ఏడాది తెగుళ్లు సోకాయి. దిగుబడి తగ్గే ప్రమాదం ఏర్పడింది. ప్రభుత్వం వక్క రైతులను ఆదుకోవాలి. బీమా వర్తింపజేయాలి.

– కెంచప్ప, వక్క రైతు, మద్దనకుంట

ఆదాయం తగ్గుతోంది



వక్క చెట్లకు రోగాలు సోకడంతో ఈ ఏడాది ఆదాయ తగ్గుతోంది. ఎకరాకు 50 క్వింటాళ్ల వరకు వక్క దిగుబడి ఉండేది. అయితే ఈసారి 30 క్వింటాళ్ల దిగుబడి కూడా రాదు. ప్రభుత్వం వక్క రైతులను ఆదుకోవాలి.

– కరియన్న, వక్క రైతు, తమదేపల్లి

జాగ్రత్తలతో తెగుళ్లకు చెక్



వక్క చెట్లు తెగుళ్ల బారిన పడిన మాట వాస్తవమే. దీనికి ఎండ తీవ్రతే ప్రధాన కారణం. తగిన జాగ్రత్తలతో తెగుళ్లకు చెక్ పెట్టొచ్చు. లీటర్ నీటిలో 15 గ్రాముల సున్నం కలిపిన ద్రావణాన్ని చిన్న వక్క చెట్లకు పిచికారీ చేయాలి. అలాగే పెద్ద వక్క చెట్లకు సున్నం పేస్టును పూయాలి. అలాగే వక్క చెట్ల సాగులో అంతర పంటగా అగస, అరటి సాగు చేస్తే ఎండ వేడిమి తగ్గి తెగుళ్ల సోకే అవకాశం ఉండదు.

– చంద్రశేఖర్, జిల్లా ఉద్యానశాఖ అధికారి



నేడు గడప గడపకూ మన ప్రభుత్వం

అమరాపురం: మండలంలోని నిద్రగట్ట గ్రామ సచివాలయంలో సోమవారం ఉదయం 7: 30 గంటలకు ఎమ్మెల్యే తిప్పేస్వామి ఆధ్వర్యంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ మునిస్వామి తెలిపారు. మండలస్థాయి అధికారులు, సచివాలయల సిబ్బంది, వలంటీర్లు, ప్రజాప్రతినిధులు హాజరు కావాలని కోరారు.

నేడు మడకశిరలో ట్రాక్టర్ల ప్రదర్శన

మడకశిర: నియోజకవర్గానికి వైఎస్సార్ యంత్ర సేవ పథకం ద్వారా 29 ట్రాక్టర్లు మంజూరైనట్లు స్థానిక ఏడీఏ కృష్ణమీనన్ ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ ఆర్బీకేల పరిధిలో ఐదుగురు రైతులు కలిసి ఏర్పాటు చేసుకున్న గ్రూపులకు ఈ ట్రాక్టర్లను అందించామన్నారు. నియోజకవర్గంలోని రైతు గ్రూపులకు అందించిన ట్రాక్టర్లతో సోమవారం మధ్యాహ్నం 2 గంటలకు మడకశిర పట్టణంలో ప్రదర్శన నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఎమ్మెల్యే తిప్పేస్వామి ప్రదర్శనను ప్రారంభిస్తారని తెలిపారు. కార్యక్రమంలో రైతులు, ప్రజా ప్రతినిధులు, ఆర్బీకే సిబ్బంది, వ్యవసాయశాఖ సిబ్బంది పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

నేడు జగనన్న విద్యా కానుక కిట్ల పంపిణీ

- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు


నీలకంఠాపురం పాఠశాలలో పంపిణీకి సిద్ధం చేస్తున్న జగనన్న విద్యా కానుక కిట్లు

మడకశిరరూరల్: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పాఠశాలలకు పెద్దపీట వేస్తూ కార్పొరేట్ తరహాలో విద్యను అందిస్తోంది. ఇందులో భాగంగానే ఏడాది విద్యా సంవత్సరం ప్రారంభంరోజే విద్యా కానుక కిట్లను అందించేలా అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. మడకశిర మండలంలో 8,585 మంది, గుడిబండలో 5,774 , అగళిలో 3,365 , రొళ్లలో 4,126, అమరాపురంలో 5,375 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. జగనన్న విద్యా కానుక పథకం ద్వారా 1వ తరగతి నుంచి పదో తరగతి వరకు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యను అభ్యసించే విద్యార్థలకు నాణ్యమైన యూనిఫారాలు, సాక్సులు , బూట్లు, నోట్, పాఠ్యా పుస్తకాలు, బ్యాగులు, డిక్షనరీలు తదితర 9 రకాల విద్యా సామగ్రిని సోమవారం పంపిణీ చేయనున్నారు. ఎమ్మెల్యే తిప్పేస్వామి మడకశిర జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో విద్యాకానుక కిట్ల పంపిణీని ప్రారంభిస్తారని ఎంఈఓ భాస్కర్ తెలిపారు. అనంతరం మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులందరికీ కిట్ల పంపిణీ జరుగుతుందన్నారు.

బాధితురాలికి న్యాయం చేయండి

హిందూపురం టౌన్: ప్రేమించిన వ్యక్తి నమ్మించి మోసం చేయడంతో ఆత్మహత్యకు యత్నించి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న యువతికి న్యాయం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఇంతియాజ్ డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న యువతిని సీపీఎం నాయకులు పరామర్శించారు. యువతికి న్యాయం జరగని పక్షంలో ప్రజా సంఘాలతో కలసి పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని అన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు, నాయకులు రాము, జగదీష్, రామకృష్ణ, అంగన్‌వాడీ ప్రాజెక్ట్ లీడర్ లావణ్య తదితరులు పాల్గొన్నారు.

సిద్ధేశ్వరునికి ప్రత్యేక పూజలు

రొళ్ల: మండలంలోని టీడీ పల్లి గ్రామ సమీపంలోని అటవీ ప్రాంతంలో వెలసిన సిద్ధేశ్వరస్వామికి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారి మూల విగ్రహాన్ని గంగా జలంలో శుద్ధి చేసి అభిషేకించారు. అనంతరం వెండి ఆభరణాలు, పూలతో అలంకరణ చేసి మహా మంగళారతి ఇచ్చారు. భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు.

'స్పందన' సద్వినియోగం చేసుకోండి

రొళ్ల: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ఉదయం 9.30 గంటల నుంచి 1 గంట వరకు నిర్వహించనున్న స్పందన కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఇన్‌చార్జ్ తహసీల్దార్ భాగ్యలక్ష్మి తెలిపారు. అలాగే మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు అన్ని సచివాలయాల ఆవరణలో స్పందన ఉంటుందని ఎంపీడీఓ రామారావు పేర్కొన్నారు.

సోమందేపల్లిలో భారీ వర్షం


మడకశిర పట్టణంలో కురుస్తున్న వర్షం


సోమందేపల్లిలో వర్షం పడుతున్న దృశ్యం

సోమందేపల్లి: మండల కేంద్రమైన సోమందేపల్లిలో ఆదివారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. ఈదురు గాలులు వీచడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. కొద్దిరోజులుగా వేడి గాలులకు ఉక్కిరి బిక్కిరవుతున్న ప్రజలు వర్షం రాకతో ఉపశమనం పొందారు.

మడకశిరరూరల్: మండలంలో ఆదివారం ఉదయం నుంచి ఎండ దంచికొట్టింది. అయితే సాయంత్రం ఈదురు గాలులతో కూడిన మోస్తారు వర్షం కురవడంతో ఒక్కసారిగా వాతావరణం చల్లబడింది. వర్షం కురవడంతో ఖరీఫ్ పంట సాగు చేసుకోవడానికి, భూములను దున్ని దుక్కి చేసుకోవడానికి ఎంతగానో ఉపయోగపడుతుందని రైతులు తెలిపారు.

కొండెక్కిన కోడి

- మొన్నటి దాకా కేజీ రూ.180
- నేడు రూ.280 నుంచి రూ.320



హిందూపురం: కోడి మాంసం ధరలు కొండెక్కాయి. మొన్నటి వరకు కేజీ చికెన్ ధర రూ.180 నుంచి 200 వరకు పలికాయి. అయితే ప్రస్తుతం మార్కెట్‌లో కేజీ చికెన్ ధర రికార్డు స్థాయిలో చేరి రూ.280 నుంచి రూ.300 వరకు పలుకుతోంది. స్కిన్‌లెస్ కిలో రూ.300 నుంచి రూ.320 ఉండగా విత్‌స్కిన్ కిలో రూ.280 నుంచి రూ.290 ధరలతో విక్రయాలు సాగుతున్నాయి. వారం రోజుల్లో రూ.వంద వరకు అమాంతంగా పెరిగిపోయింది. లైవ్‌కోడి రూ.180 వరకు పలుకుతుండగా స్కీన్‌లైస్ చికెన్ దాదాపు రూ.300కు పైగా ధరలు పలుకుతున్నాయి.

ఉష్ణోగ్రత దెబ్బ..

కొద్దిరోజులుగా వేసవిలో ఉమ్మడి జిల్లాల్లో గణనీయంగా పెరిగిపోతున్న ఉష్ణోగ్రతకు ఫారాల్లో కోళ్లు పెద్ద సంఖ్యలో చనిపోతున్నాయి. మార్కెట్‌లో సప్లయ్‌కి తగ్గట్టు సరఫరా లేకపోవడంతో డిమాండ్ పెరిగిపోయింది. దీనికి తోడు దాణా ధరలు పెరగడం మరో కారణంగా మారింది. ఫంక్షన్లు, వివాహాలు, పార్టీల్లో కూడా చికెన్ వినియోగం పెరిగిపోయింది. దీంతో రేట్లు ఆకాశాన్నంటుతున్నాయి. మధ్యతరగతి కుటుంబాల్లో ఎక్కువగా మటన్ కన్నా చికెన్ తినడానికే మొగ్గుచూపుతారు. మటన్ రేటు ఎక్కువగా ఉండటంతో అందరూ చికెన్ తినడానికే ఎక్కువ ప్రాధాన్యత ఇస్తారు. ముఖ్యంగా పరిశ్రమలోకి కార్మికులు, కూలీలు, వలస కార్మికులు అత్యధికంగా హిందూపురం ప్రాంతంలోనే ఉంటున్నారు. గతంలో బిజినెస్ బాగా జరిగేదని కొద్ది రోజులుగా చికెన్ ధరలు పెరగడంతో బిజినెస్ తగ్గుతోందని వ్యాపారులు చెబుతున్నారు.

350కి పైగా కోళ్ల ఫారాలు

ఉమ్మడి జిల్లాలోని హిందూపురం, ధర్మవరం, కదిరి, గుంతకల్లు, రాయదుర్గం, తాడిపత్రి తదితర ప్రాంతాల్లో సుమారు 350పైగా పెద్ద కోళ్ల ఫారాలు ఉన్నాయి. వీటిలో సుమారు 25 లక్షల కోళ్ల పెంపకం జరుగుతున్నట్లు అంచనా. బ్యాచ్ వేసిన 40 రోజుల్లో బ్రాయిలర్ కోళ్లు రెండు నుంచి రెండున్నర కేజీల వరకు పెరిగి వినియోగానికి వస్తుంటాయి. ఎండల దెబ్బకు కోళ్లు చనిపోతుండటంతో నష్టాలు ఎదుర్కోవల్సి వస్తుందని మే, జూన్ మాసాల్లో కొత్తబ్యాచ్‌లను తగ్గించి వేశారు. దీంతో చికెన్‌కు డిమాండ్ పెరిగింది.

కోళ్ల మేతకూ రెక్కలు

మూడునెలల నుంచి కోళ్ల మేత ధరలు పెరగడంతో తమకు పెద్దగా లాభం ఉండటం లేదని కోళ్ల ఫారాల నిర్వాహకులు చెబుతున్నారు. మొక్కజొన్న కిలో రూ.20నుంచి రూ.25 దాకా పెరిగింది. సోయా కిలో రూ.56 నుంచి ఏకంగా రూ.98 దాకా పెరిగింది. అన్ని మేతలు మిక్స్‌పై కిలోపై రూ.40 నుంచి రూ.60 దాదా ధరలు పెరిగాయని పెంపకందారులు అంటున్నారు. ప్రతి కొడిపిల్ల చిక్‌ఫీడ్, రవాణా ఇతర ఖర్చులతో కలిపి రూ.120 దాకా పెరిగింది. కిలో కోడి తయారు కావడానికి రెండు కిలోల మేత అవసరం అవుతుంది. అన్ని ఖర్చులతో కలిసి కిలో కోడి మార్కెట్‌లోకి రావడానికి రూ.150 దాకా ఖర్చు అవుతోందని అంటున్నారు.

ఇంకా ధరలు పెరిగే అవకాశం



ప్రస్తుత వేసవిలో డిమాండ్‌కు సరిపడే విధంగా కోళ్ల దిగుమతి లేదు. కంపెనీ వారు కూడా ఫారాల్లో ముందస్తుగా బుక్ చేసుకుంటే గాని అవసరమైనంత కోళ్లు అందించలేకపోతున్నారు. అధిక శాతం ఫారాలన్నీ కంపెనీ ఆధీనంలోనే ఉండటం కొత్తబ్యాచ్‌ల పెంపకం, సప్లయ్ ధర పెరుగుదల అన్నీ వారి నిర్ణయంపైనే ఉంటాయి. కొత్త బ్యాచ్ మార్కెట్‌కు వచ్చే వరకు చికెన్ ధరలు పెరుగుతూనే ఉంటాయి.

– రవికుమార్, చికెన్ వ్యాపారి, హిందూపురం

ముగిసిన వేసవి విజ్ఞాన శిబిరాలు


హిందూపురం: విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేస్తున్న దృశ్యం


రొద్దం: విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేస్తున్న దృశ్యం


అమరాపురం: విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న ఎంపీపీ ఈరన్న

- పుస్తక పఠనంతోనే విజ్ఞానం సాధ్యమన్న వక్తలు
- ప్రతిభ చూపిన వారికి బహుమతుల ప్రదానం

హిందూపురం టౌన్: పుస్తకం ఒక మంచి నేస్తమని, చిన్నతనం నుంచే గ్రంథాయాలకు వచ్చి పుస్తక పఠనం అలవాటు చేసుకోవాలని వక్తలు తెలిపారు. ఆదివారం స్థానిక శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం ముగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ గ్రంథాలయాల ద్వారా విద్యార్థులు విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలన్నారు. అనంతరం ఉపాధ్యాయులు శ్రీశైలం, అబ్దుల్ బాషా, ప్రవీణ్ కుమార్‌లను సన్మానించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్ఐ కళావతి, లైబ్రేరియన్ శ్రీధర్, యూనైటెడ్ ఫ్రంట్ అధ్యక్షుడు ఉమర్ ఫారుఖ్, కమిటీ సభ్యులు కల్లూరు రాఘవేంద్ర, గంగాధర్, శౌంతి జయప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

సోమందేపల్లి: పుస్తక పఠనంతో విద్యార్థులు విజ్ఞానాన్ని పెంపొందించుకోవచ్చని గ్రంథాలయాధికారి మహబూబ్ బాషా తెలిపారు. వేసవి శిక్షణ తరగతులు ముగింపు సందర్భంగా ఆదివారం వివిధ పోటీల్లో ప్రతిభ చాటిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కిష్టప్ప, వినోద్, శ్రీనివాసులు, దాదు తదితరులు పాల్గొన్నారు.

రొద్దం: మండల కేంద్రంలోని శాఖా గ్రంథాలయంలో ఆదివారం వేసవి శిక్షణ తరగతులు ముగిశాయి. ఈ కార్యక్రమంలో వివిధ పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఎస్ఐ నాగస్వామి మాట్లాడుతూ ప్రతి విద్యార్థి అవకాశాలను అందిపుచ్చుకొని ఉన్నత చదువులు చదవాలన్నారు. గ్రంథాలయ శాఖ అధికారి నాగరాజు , ఉపాధ్యాయులు తేజ, విశ్రాంత ఉపాధ్యాయుడు లక్ష్మిరెడ్డి, హెడ్‌కానిస్టేబుల్ కాంతప్ప తదితరులు పాల్గొన్నారు.

గుడిబండ: ఉన్నత చదువుతోనే ఉజ్వల భవిష్యత్ సాధ్యమని గుడిబండ సర్పంచ్ కరుణాకర్‌గౌడు, గ్రంథాలయ అధికారి కమలనాభరావు అన్నారు. ఆదివారం స్థానిక గ్రంథాలయ ఆవరణలో గ్రంథాలయ వేసవి శిక్షణ శిబిరం ముగింపు సందర్భంగా విద్యార్థులకు కథల పుస్తకాలు అందజేశారు. వైఎస్సార్‌సీపీ నాయకులు శశిధర్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

మడకశిర: మడకశిర గ్రంథాలయంలో నిర్వహించిన వేసవి విజ్ఞాన శిబిరం విద్యార్థులకు ఎంతో మేలు చేసిందని స్థానిక ఎంఈఓ భాస్కర్ తెలిపారు. మడకశిర గ్రంథాలయంలో 35 రోజుల పాటు సాగిన వేసవి విజ్ఞాన శిబిరం ఆదివారంతో ముగిసింది. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి శ్రీనివాసులు, ఉపాధ్యాయుడు పవన్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

చిలమత్తూరు: గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన వేసవి విజ్ఞాన శిబిరాలు ఆదివారంతో ముగిశాయి. చిత్రలేఖనం, పేపర్ క్రాఫ్ట్ , కథలు చెప్పడం వంటి పోటీలు నిర్వహించి ప్రతిభ చూపిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి మల్లికార్జున, డ్రాయింగ్ మాస్టర్ వేణుగోపాల్, రిసోర్స్ పర్సన్ ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

అమరాపురం: స్థానిక గ్రంథాలయంలో నెల రోజులుగా నిర్వహించిన వేసవి శిక్షణ శిబిరం ఆదివారంతో ముగిశాయి. ముఖ్య అతిథిగా హాజరైన ఎంపీపీ ఈరన్న మాట్లాడుతూ పుస్తకాలు చదవడం ద్వారా మంచి విజ్ఞాన వంతులు అవుతారని చెప్పారు. అనంతరం ప్రతిభ చూపిన విద్యార్థులకు ఎంపీటీసీ నాగభూషణ, రాష్ట్ర క్రిష్టియన్ ఫైనాన్స్ డైరెక్టర్ సుందర్‌రాజు చేతుల మీదుగా బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో బీడీసీలు వీరక్యాతరాయప్ప, మారెన్న, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

లేపాక్షి: లేపాక్షిశాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం ఆదివారంతో ముగిసింది. శిక్షణ శిబిరంలో రోజూ ఒక కార్యక్రమం చొప్పున అనేక కార్యాక్రమాలు నిర్వహించినట్లు గ్రంథాలయ అధికారి జయసింహరాజు తెలిపారు. ఈ సందర్భంగా ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు.

రొళ్ల: గ్రంథాలయాలతో జ్ఞానాన్ని మరింత పెంపొందించుకోవచ్చని గ్రంథాలయ అధికారి వెంకటరమణ తెలిపారు. స్థానిక గ్రంథాలయ కార్యాలయంలో నిర్వహించిన వేసవి ప్రత్యేక శిక్షణ తరగతులు ఆదివారంతో ముగిశాయి. ఈ వక్తలు విద్యార్థులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో స్వీపర్ గోపాల్‌మూర్తి, బీడీసీ నరసంహమూర్తి, రీసోర్స్ పర్సన్ వేణుగోపాల్, పాఠకులు నాగరాజు, కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

పరిగి: గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని కాణిపాకం ఆలయ ట్రస్టు డైరెక్టర్ మారుతీ స్వామి తెలిపారు. గ్రంథాలయాల వేసవి శిక్షణ ముగింపు సందర్భంగా ఆదివారం పరిగి మండల కేంద్రంలో వారోత్సవాలను గ్రంథాలయాధికారి విజయకుమారి నేతృత్వంలో ఘనంగా నిర్వహించారు. ఉపాధ్యాయుడు క్రిష్టప్ప, శ్రీధర్, పాఠకులు, పుర ప్రముఖులు పాల్గొన్నారు.

తండ్రిపై కుమారుడి దాడి

రొద్దం: మండల పరిధిలోని నల్లూరు గ్రామంలో ఆదివారం తండ్రిపై కుమారుడు దాడి చేశాడు. ఎస్ఐ నాగస్వామి తెలిపిన వివరాలమేరకు... నల్లూరులో నివాసం ఉంటున్న రమణపై అనే వ్యక్తిపై ఆయన కుమారుడు మూర్తి దాడి చేసినట్లు చెప్పారు. కుటుంబానికి సంబంధించిన విషయంలో మాటా మాటా పెరగడంతో రమణపై మూర్తి దాడి చేశాడన్నారు. ఈ ఘటనలో రమణ చేయి విరిగిందన్నారు. వెంటనే అతన్ని చికిత్స నిమిత్తం పెనుకొండ ఆస్పత్రికి తరలించినట్లు పేర్కొన్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

కరాటే బెల్టు సర్టిఫికెట్ల పంపిణీ


విద్యార్థులకు సర్టిఫికెట్లు పంపిణీ చేసిన దృశ్యం

హిందూపురం: విద్యార్థులు విద్యతో పాటు కరాటే ఇతర క్రీడలపై ఆసక్తి పెంపొందించుకోవాలని దీప్తి స్కూల్ కరిస్పాండెంట్ దీపూ అబ్రహాం అన్నారు. దీప్తి స్కూల్‌లో కరాటే శిక్షణకులు సెన్సెయి ఫైరోజ్ శిక్షణ పొందిన విద్యార్థులకు ఆల్‌ఇండియా చీఫ్ కోచ్ అల్తాఫ్‌పాషా ఆదేశాలతో ఆదివారం బెల్ట్ పరీక్షలు నిర్వహించి ప్రతిభ కనపర్చిన వారికి సర్టిఫికెట్లు అందించారు.